సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 17 । మార్చి । 2024



వంద రోజుల్లోనే..

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం పలు గ్రామాలలో పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.6 /21.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గవచ్చు. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 4,927 కేసుల పరిష్కారం



కామారెడ్డి క్రైం: జిల్లాలోని కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో 4,927 కేసులను పరిష్కరించామని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి తెలిపారు. ఇందులో 23 సివిల్, 4,895 క్రిమినల్, 9 ప్రిలిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారుల సహకారంతో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. లోక్ అదాలత్ కోసం న్యాయ శాఖ ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. లోక్ అదాలత్ విజయవంతం చేయడం కోసం ఎంతగానో కృషి చేసిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శివరాత్రి ప్రతాప్‌ను అభినందించారు. కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, సిబ్బందికి కామారెడ్డి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆహారం, నీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

ఆర్టీసీ డిపోలో హెల్త్‌క్యాంప్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శనివారం వన్ కార్డ్ బిజినెస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో అఖిల, నిమ్మస్ డెంటల్ హాస్పిటల్స్ సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరం అయిన వారికి మందులు అందించారు. డిస్కౌంట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇందిర, వైద్యులు పుట్ట మల్లికార్జున్, పుట్ట భవాని, అభిషేక్ రెడ్డి, హెల్త్ వలంటీర్లు కల్పన, ఎల్‌వీ రావు, వన్ కార్డ్ ప్రతినిధులు రవి, రమ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి కౌంటర్‌లో వివరాలివ్వాలి'

దోమకొండ : జీరో కరంట్ బిల్లులు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రానివారు గృహజ్యోతి కౌంటర్లలో వివరాలు అందించాలని జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గృహజ్యోతి కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, సీతారం మధు, రాములు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం కళాశాల టీఎస్‌కేసీ, హైదరాబాద్‌కు చెందిన మ్యాన్ పవర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సోలార్, ఎలక్ట్రిక్ కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 25 మంది ఎంపికయ్యారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్, టీఎస్‌కేసీ సమన్వయకర్తలు శంకరయ్య, ఫర్హీన్ ఫాతిమ పాల్గొన్నారు.

'ఆగ్రో ఇండస్ట్రీస్' చైర్మన్‌గా కాసుల బాలరాజు

సాక్షిప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం పలు కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను ప్రకటించింది. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాన్సువాడకు చెందిన కాసుల బాలరాజును నియమించింది. విత్తనాభివృద్ధి సంస్థకు అన్వేశ్‌రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థకు ఈరవత్రి అనిల్, కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్‌కు మానాల మోహన్‌రెడ్డి చైర్మన్‌లుగా నియామకమయ్యారు.

'మెట్ల బావి'కి పూర్వవైభవం!



లింగంపేటలోని నాగన్నగారి మెట్ల బావి

పాలకుల నిర్లక్ష్యంతో ఉనికి కోల్పోయిన చారిత్రక సంపదను కాపాడేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవ చూపుతున్నారు. మరుగున పడిపోయిన మెట్ల బావుల్లో నిండిపోయిన పూడికను తొలగింపజేసి, వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయన కృషితో ఇప్పటికే భిక్కనూరు, లింగంపేట బావులు కొత్త రూపు సంతరించుకున్నాయి. ఎల్లారెడ్డి, రాజంపేటలలోని మెట్ల బావులకూ పూర్వవైభవం చేకూర్చే పనులు సాగుతున్నాయి.

– సాక్షి, కామారెడ్డి



భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం వద్దనున్న మెట్ల బావి

- కలెక్టర్ పాటిల్ చొరవతో మరమ్మతులు
- రెయిన్ వాటర్ ప్రాజెక్టు, సహీ ఎన్జీవోల సహకారంతో ముందుకు..
- ఇప్పటికే భిక్కనూరు, లింగంపేట బావులకు కొత్తరూపు
- ఎల్లారెడ్డి, రాజంపేటలలోనూ పనులు షురూ..

కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలలో చారిత్రక ప్రాధాన్యత గల మెట్లబావులున్నాయి. వాటి ఆలనపాలన పట్టించుకునేవారు లేకపోవడంతో ఉనికిని కోల్పోతూ కాలగర్భంలో కలిసిపోయే స్థితికి వచ్చాయి. శిథిలావస్థకు చేరిన మెట్ల బావులకు పూర్వవైభవం చేకూర్చేందుకు 'సాక్షి' అక్షర సమరం చేపట్టింది. 2022 జనవరి 29న లింగంపేటలోని నాగన్న బావి ఉనికి కోల్పోతున్న వైనంపై 'మెట్ల బావిలో నిర్లక్ష్యపు పూడిక' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. తర్వాత వరుసగా 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందించారు. నాగన్న బావిని సందర్శించిన కలెక్టర్.. మెట్ల బావులకు పూర్వవైభవం చేకూర్చేందుకు ఆయన కంకణం కట్టుకున్నారు. ఆయన గ్రామస్తులతో కలిసి ముళ్ల పొదలు, చెట్లను తొలగించడంతోపాటు పూడిక తీయించారు. రెయిన్ వాటర్ ప్రాజెక్టు అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కల్పనా రమేశ్‌తో మాట్లాడి వారి సహకారంతో దానికి పూర్వ వైభవం తీసుకువచ్చారు. అలాగే భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయ ప్రాంగణంలో మరుగునపడిన మెట్ల బావిని సందర్శించిన కలెక్టర్.. ఆ బావిని కూడా అద్భుతంగా తీర్చిదిద్దారు. మెట్ల బావి వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. సిద్ధరామేశ్వర ఆలయ దర్శనానికి వెళ్లిన వారంతా మెట్ల బావి కట్టడాన్ని చూసి అచ్చెరువొందుతున్నారు. ఫొటోలు దిగుతూ సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు.

మరికొన్ని బావుల గుర్తింపు

ఎల్లారెడ్డి పట్టణంలో రెండు మెట్ల బావులు, రాజంపేట మండల కేంద్రంలో ఒకటి, లింగంపేట మండలం శెట్పల్లి, నాగిరెడ్డిపేట మండలం మాటూరు గ్రామాల్లో మెట్ల బావులను గుర్తించారు. వాటిలో పేరుకుపోయిన పూడికను తొలగించి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రెయిన్ వాటర్ ప్రాజెక్టు, సహీ ఎన్జీవోల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

సండే స్పెషల్

కలెక్టర్ చొరవతో పూర్వ వైభవం



18వ శతాబ్దంలో నిర్మించిన నాగన్నగారి మెట్ల బావి కాల క్రమంలో శిథిలావస్థకు చేరుకుంది. దీని పునరుద్ధరణకు కలెక్టర్ చొరవ తీసుకున్నారు. మరుగున పడి పాడుబడిపోతున్న చారిత్రక సాక్ష్యానికి జీవంపోసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. బావిలోకి దిగడానికి నాలుగువైపులా ఉన్న మెట్లు అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుతం మెట్లబావి మరమ్మతులు పూర్తి చేసుకొని పర్యాటకుల సందర్శనకు సిద్ధంగా ఉంది. మెట్లబావికి పూర్వ వైభవాన్ని తెచ్చిన అధికారులకు కృతజ్ఞతలు.

– కొట్టూరి లక్ష్మీనారాయణ, లింగంపేట

నాటి కళా నైపుణ్యం చెక్కు చెదరలేదు



కాకతీయుల కాలం నాటి కళానైపుణ్యానికి నిదర్శనం లింగంపేట మెట్లబావి. నాగన్న మెట్ల బావి అంటే అత్యంత లోతైన బావిగా పేరుంది. బావిపైనుంచి కింది వరకు మెట్లు, గుమ్మటాలున్నాయి. ఆ కాలంలో చుట్టు పక్కల పంట పొలాలకు మోటబావితో నీళ్లు పారించేవారట. పూర్వకాలంలో ఏనుగులు బావిలో దిగి నీళ్లు తాగేవని చెప్పేవారు. రానురాను మెట్లబావి నిర్లక్ష్యానికి గురైంది. అయినా నాటి కళా నైపుణ్యం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. బావికి పూర్వ వైభవం తెచ్చినందుకు సంతోషంగా ఉంది.

– జంగం ప్రభులింగం, లింగంపేట

అద్భుతమైన నిర్మాణాలు..



మెట్ల బావుల గురించి కలెక్టర్ జితేష్ వి పాటిల్ మమ్మల్ని సంప్రదించారు. ఇక్కడ అద్భుతమైన నిర్మాణాలు ఉన్నాయి. వాటికి పూర్వ వైభవం తేవడానికి మా సంస్థ సహీ ఎన్జీవోతో పాటు పలు కార్పొరేట్ కంపెనీల సహాయం తీసుకుంటోంది. పురావస్తు శాఖలో పనిచేసిన సాయినాగిరెడ్డి గారు సహకరిస్తున్నారు. లింగంపేటలోని నాగన్నబావికి ఇప్పటి వరకు రూ.90 లక్షలు ఖర్చు చేశాం. పనులు పూర్తవడానికి ఇంకో పది లక్షలు దాటే అవకాశం ఉంది. భిక్కనూరులోని సిద్ధరామేశ్వర ఆలయం వద్ద ఉన్న బావికి రూ.45 లక్షలు ఖర్చు చేశాం. ఎల్లారెడ్డి పట్టణంలోని రెండు బావులను తీర్చిదిద్దేందుకు ఫండ్ రైజింగ్ చేస్తున్నాం. ఒక్కోదానికి రూ.40 లక్షలపైనే ఖర్చవుతాయి.

– కల్పనా రమేశ్, రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్, హైదరాబాద్

చారిత్రక సంపదను కాపాడుకోవాలి



చారిత్రక సంపదను బావి తరాలకు అందించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాం. వారి సహకారంతో మెట్ల బావులను అభివృద్ధి చేస్తున్నాం. చెట్లు, మట్టి తీయడం వంటి పనులు పంచాయతీల ద్వారా సాగుతున్నాయి. పునర్నిర్మాణానికి సంబంధించిన పనులను రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనా రమేశ్ సహకారంతో చేపడుతున్నాం. మెట్ల బావులకు పూర్వ వైభవం వస్తోంది. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. నేను ఢిల్లీలో అగ్రసేన్ బావిని చూశాను. మన దగ్గర ఉన్నవి ఇంకా బాగున్నాయి. పునరుద్ధరణతో వర్షాకాలంలో శుభ్రమైన నీరు కనబడుతుంది.

– జితేష్ వి పాటిల్, కలెక్టర్

లోక్‌సభ ఎన్నికలకు మోగిన నగారా

- మే 13 న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- అమలులోకి ఎలక్షన్ కోడ్
- అప్రమత్తమైన అధికారులు
- వేడెక్కనున్న రాజకీయం



సాక్షి, కామారెడ్డి: లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. ఎలక్షన్ కమిషన్ శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల ఎన్నికకు వచ్చేనెల 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అదేరోజు నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. మే 13 న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకటనతోపాటే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోల్, నారాయణ్‌ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఎన్నికల నగారా మోగడంతో జిల్లా యంత్రాంగం అలర్ట్ అయ్యింది. కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు రంగంలోకి దిగింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మల ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అమలుకు సన్నద్ధమయ్యారు. కోడ్ అమలులోకి రావడంతో అధికారిక కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయాలు వేడెక్కనున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఇక ప్రచార పర్వంలోకి దిగనున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	1,22,238	1,32,014	20	2,54,272
జుక్కల్	99,113	1,02,813	09	2,01,935
ఎల్లారెడ్డి	1,06,373	1,15,355	02	2,21,730
బాన్సువాడ	93,266	1,02,415	13	1,95,694

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- సి విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు
- ప్రెస్‌మీట్‌లో జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ సింధు శర్మ

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరుందో లేదో చూసుకోవాలని సూచించారు. జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటరుకు రెండు కిలోమీటర్ల దూరంలోపు పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఎలక్షన్ కోడ్‌ను పాటించాలి

ఎలక్షన్ కోడ్‌ను అందరూ పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషిద్ధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశాలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీలు, నాయకులకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు ఇస్తామన్నారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వైలెన్సు బృందాలు, ఎంసీఎంసీ తదితర కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సి-విజల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సి -విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన వంద నిమిషాలలోపు అధికారులు క్షేత్రస్థాయికి చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లలో ప్రింటింగ్ ప్రెస్, ఎవరు ప్రింట్ చేయించారోవారి ఫోన్ నంబర్ కూడా తప్పనిసరిగా ముద్రించాలన్నారు.

కట్టుదిట్టమైన చర్యలు..

జిల్లాలో అక్రమంగా నగదు, మద్యం సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించిన నగదుతో ఎవరూ ప్రయాణించవద్దన్నారు. తనిఖీలలో స్వాధీనం చేసుకున్న సొమ్మును ప్రతిరోజూ గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఆ డబ్బుకు ఆధారాలు సమర్పిస్తే గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని పేర్కొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ పారదర్శకత స్పష్టంగా కనిపించాలన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనరాదన్నారు. పార్టీల వాల్ పోస్టర్లు, కటౌట్లను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలోనున్న రాజకీయ నాయకుల ఫొటోలు, క్యాలెండర్లను తక్షణమే తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కప్పాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం, ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం వంటి అంశాలు చాలా కీలకమని పేర్కొన్నారు. సి-విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్నిబట్టి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అధికారులు రాజారాం, బావయ్య, మురళీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన గులాబీ శ్రేణులు

- ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై నిరసన
- నిరసనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు



కామారెడ్డిలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప, బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, కామారెడ్డి: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ గులాబీ శ్రేణులు రోడ్డెక్కాయి. పలు ప్రాంతాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పాల్గొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుందలో నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, ఎల్లారెడ్డిలో జరిగిన ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, మహ్మద్ నగర్ తదితర చోట్ల ప్రధానమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని నేతలు ఆరోపించారు.


రాజకీయ దురుద్దేశంతోనే కవిత అరెస్ట్

కామారెడ్డి క్రైం: రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆరోపించారు. కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ముందుగా పట్టణంలో ర్యాలీ తీసి, నిజాంసాగర్ చౌరస్తాలో ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకే కవితను అరెస్ట్ చేయించారన్నారు. ఇది బీజేపీ కుట్రేనని ఆరోపించారు. కేసులకు వెరవబోమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, కుంబాల రవి, లక్ష్మీనారాయణ, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వడగండ్ల వాన బీభత్సం



మద్నూర్‌లో కురుస్తున్న వడగండ్ల వాన



హజ్గుల్‌లో కురిసిన వడగండ్లు



భిక్కనూరులో నేలకూలిన వేప చెట్టు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలోని పలు ప్రాంతాలలో శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలకు నష్టం వాటిల్లింది. దోమకొండ, బీబీపేట, తాడ్వాయి, రాజంపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, సదాశివనగర్, గాంధారి, మద్నూర్, నిజాంసాగర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, రామారెడ్డి, మాచారెడ్డి తదితర మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల రోడ్డు పక్కన చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో మామిడి కాయలు నేలరాలాయి. వరికంకులు నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లింది. భూగర్భజల మట్టం పడిపోయి బోర్లు ఎత్తిపోతుండడంతో పంటలకు నీరందక ఎండిపోతున్న పరిస్థితుల్లో అకాల వర్షం కొంత ఊరటనిచ్చినా.. వడగళ్లతో నష్టం జరిగింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న జనం కాస్త తెరిపినపడ్డారు.

క్లుప్తంగా

సిద్ధరామేశ్వరాలయం ఉత్సవ కమిటీ ఏర్పాటు

భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు దేవాదాయశాఖ కమిషనర్ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా తాటిపాముల లింబాద్రి, ఎస్. శివయ్య, జి బాలమణి, ఎస్ అంజయ్య, ఏ అమృత, సామ సంతోషరెడ్డి, ఆర్ ప్రవీణ్‌గౌడ్, పి ఈశ్వర్‌రెడ్డి, ఎం కిష్టయ్య, ఎస్ రమేష్‌రెడ్డి, జి నారాయణ, ఎల్ బాగయ్య, ఎం బాపురెడ్డి, కాశీనాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులను కమిషనర్ జారీచేశారు. ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నియామకం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామానికి చెందిన కంచర్ల రాజశేఖర్ తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైనట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు జువ్వాడి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా నియామకపత్రాన్ని రాజశేఖర్‌కు శనివారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతి ఐక్యతకు పాటుపడుతూ మన హక్కులను సాధించుకోవడం కోసం సమష్టిగా పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చినోళ్ళ భాస్కర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, .ధర్మపురి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సందర్శన



భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జియో ఇన్ఫర్మేషన్ విభాగంలో నూతన ఆవిష్కరణలు పరిశోధనలు ఏ విధంగా నిర్వహిస్తున్నారన్న విషయమై అంశాలను గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, ప్రొఫెసర్లు ప్రతిజ్ఞ, నారాయణగుప్తా, జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ మాట్లాడుతూ హాస్టళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోహిత్ నాయకులు రాజు, సంతోష్, అజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం

- జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు



ఎల్లారెడ్డిలో పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి : ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం రాజకీయ కుట్ర అని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో కవిత అరెస్టుకు నిరసనగా ధర్నా చేశారు. అనంతరం పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ తదితరులున్నారు.

బిచ్కుంద(జుక్కల్) : ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్ గుర్తుతో రెండు సార్లు గెలిచి బీజేపీలో పోవడం చాలా విచిత్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో జుక్కల్, బిచ్కుంద మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాన్సువాడ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం బాన్సువాడ, బీర్కూర్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, జంగం గంగాధర్, ఎజాస్, పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి నార్ల ఉదయ్ తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బస్టాండ్ వద్ద పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, గొర్గంటి రాములు తదితరులున్నారు.



మహమ్మద్‌నగర్‌లో..



బిచ్కుందలో..



బాన్సువాడలో..



బీర్కూర్‌లో..

శ్రీరామారావ్ మహరాజ్ బోధనలు పాటించాలి

బాన్సువాడ రూరల్ : గిరిజనులు తమ ఆరాధ్య గురువు శ్రీరామారావ్ మహరాజ్ సూచించిన భక్తి మార్గాన్ని అనుసరిస్తూ, గురువు బోధనలను పాటించాలని శ్రీసంత్ సేవాలాల్ దీక్షా గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ సూచించారు. శనివారం రాంపూర్ తండాలో శ్రీరామారావ్ మహారాజ్ విగ్రహం ఆవిష్కరించి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన భోగ్ భండార్‌కు హాజరై మాట్లాడారు. శ్రీరామారావ్ మహారాజ్ బోధనలతో గిరిజనుల జీవితాలు బాగుపడ్డాయన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, విగ్రహదాతలు చవాన్‌రవి, చవాన్ మెహన్‌లతో తదితరులతో కలిసి వేదపండితుల పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు మోరీల్ శ్రీనివాస్‌రావు, కొత్తకొండ భాస్కర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు ప్రతాప్‌సింగ్ తదితరులున్నారు.



రాంపూర్‌తండాలో భోగ్ బండార్‌లో పాల్గొన్న గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్

వేద పఠనం.. మనిషికి జీవనాధారం



కామారెడ్డి అర్బన్ : వివిధ మతాల మధ్య బేధాభిప్రాయాలున్నప్పటికి ధర్మం విషయంలో ఏ బేధం లేదనే విషయాన్ని గ్రహించాలని విదూషిమణి కవిత ఆర్య అన్నారు. స్థానిక సిరిసిల్ల రోడ్డులోని శ్రీకృష్ణ గీత మందిరం 22వ వార్షికోత్సవం ఈనెల 19న నిర్వహిస్తున్న సందర్భంగా శని, ఆది, సోమవారాల్లో ప్రతిరోజు సాయంత్రం 5-30 గంటల నుంచి 7గంటల వరకు ఆచార్య సత్యమిత్ర, విదూషిమణి కవిత ఆర్య వేదజ్ఞానామృత ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పాత అశోక్, అర్వపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నా చావుకు కారణం ఆ తొమ్మిది మందే..

- పిలిచి మరీ అవమానించారు
- సెల్ఫీ వీడియో తీసి రైతు ఆత్మహత్య
- కామారెడ్డి మండలం లింగాయిపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

కామారెడ్డి క్రైం: పంట పొలం వద్ద ఆవును వదిలి పెట్టిన విషయంలో తలెత్తిన వివాదం ఒకరి ఆత్మహత్యకు దారి తీసింది. కూర్చొని మాట్లాడుకుందామని పిలిచిన వ్యక్తులు తలో మాట అనడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు కొద్ది క్షణాల ముందు తన చావుకు కారణాలను, కారకులను వివరిస్తూ అతడు సెల్ఫీ వీడియో తీసి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడం కలకలం రేపింది. ఈ ఘటన కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోరెడ్డి రవీందర్‌రెడ్డి (42) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు అతని ట్రాక్టర్ ఇంజన్‌లో చక్కెర పోసి చెడగొట్టారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన కల్లూరి వెంకట్‌కు రవీందర్ రెడ్డికి గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఆవును పంట పొలంలో వదిలి పెట్టిన విషయంలో మరోసారి వెంకట్‌కు, రవీందర్‌రెడ్డి, అతని అన్న కిష్టారెడ్డికి మధ్య గొడవ జరిగి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన దేమె రవి ఫోన్ చేసి కూర్చొని మాట్లాడుకోవడానికి కామారెడ్డికి రమ్మని పిలువగా రవీందర్‌రెడ్డి, అతని అన్న కిష్టారెడ్డి వెళ్లారు. దేమె రవి, తోట భూపతి, కిషన్‌గౌడ్, కల్లూరి మల్లేషం, తోట ఉదయ్‌లు కలిసి మీరు తప్పు చేశారని, ఒప్పుకోవాలంటు పట్టుబట్టారు. అంతేగాకుండా దుర్భాషలాడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తన చావుకు 9 మంది వ్యక్తులు కారణమంటూ సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతని కోసం గాలించారు. రాత్రి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు దేమె రవి, తోట భూపతి, కిషన్‌గౌడ్, కల్లూరి మల్లేషం, తోట ఉదయ్, బోరెడ్డి నాగరాజు, మల్లారెడ్డి, భానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.



రవీందర్‌రెడ్డి(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఎడపల్లి: మండలంలోని మంగల్‌పహాడ్‌లో ఒకరు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామానికి చెందిన ఇల్లందుల నరేందర్‌గౌడ్(42)కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో మరోసారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫరీద్‌పేటలో ఒకరి అదృశ్యం



స్వామి

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన బట్ట స్వామి అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. ఈ నెల 15న పని నిమిత్తం బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డి: పట్టణ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 5940 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెర్కిట్‌లో చోరీ



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 21వ వార్డులో ఉన్న అబ్దుల్ నయీముద్దీన్ ఇంట్లో సుమారు రూ. 2లక్షలు, 10 తులాల బంగారం, 22వ వార్డులో షబానా బేగం ఇంట్లో రూ. 80వేల నగదు, తులం బంగారాన్ని చోరీ చేశారు. అదే వార్డులో చిలక గంగుబాయి ఇంటికి ఉన్న తాళాన్ని ధ్వంసం చేసి చోరీ చేసేందుకు యత్నించగా పక్కనే నివాసం ఉంటున్న వారికి శబ్దం రావడంతో కేకలు వేయడంతో వారు పారిపోయారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆలయంలో..

సిరికొండ: మండలంలోని గోప్యానాయక్ తండాలోని జగదాంబదేవి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఎస్సై రమేశ్ శనివారం తెలిపారు. ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం నుంచి అరతులం బంగారు తాళి, ఐదు తులాల వెండి విగ్రహం, హుండీ నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. తాండవాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

బాల్కొండ: లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన వడ్ల గణేశ్(52) ముప్కాల్ నుంచి బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నాడు. మెండోరా మండలం దూదిగాం శివారులో రోడ్డు డైవర్షన్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ గణేశ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి జాలరి..

నందిపేట్: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు వల చుట్టుకొని మృతి చెందిన ఘటన మండలంలోని అయిలాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరీశ్(22) చిన్నతనంలోనే తల్లితండ్రులు మృతి చెందడంతో అతని బాబాయి పోశెట్టి వద్ద ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లిన హరీశ్ తిరిగి రాలేదు. శనివారం ఉదయం చెరువు వద్ద మృతుడి టీషర్ట్ ఉండడంతో కుటుంబీకులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరి..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై మేకల కాపరి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాకేడ్ గ్రామానికి చెందిన మల్లేశ్ (25) బతుకు దెరువు నిమిత్తం మెండోరాకు వచ్చి మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఉదయం మేకలను మేత కోసం మండల శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ చెట్టుపై నుంచి కొమ్మలను నరుకుతుండగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి లస్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ఆర్మూర్ టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మామిడిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని ఓ వృద్ధుడు(70) రోడ్డు దాటుతుండగా ఆర్మూర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో వృద్ధుడికి గాయాలు కాగా స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. వృద్ధుడి ఆచూకి తెలిసినవారు ఆర్మూర్ పీఎస్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

భారీగా వడగళ్ల వర్షం

జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల కారణంగా వరి వాలిపోయింది. రైతులకు అకాల వర్షంతో నష్టం ఏర్పడింది.



బోర్లం గ్రామంలో కురుస్తున్న వర్షం



రెడ్డిపేటలో..



భిక్కనూరులో కురిసిన వడగండ్లు

వంద రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు

- మద్నూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మద్నూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మద్నూర్(జుక్కల్) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అభివృద్ధి, విజయోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో పలు గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని సుల్తాన్‌పేట్, చిన్న శక్కర్గా, చిన్న తడ్గూర్, ఖరగ్, సోముర్ గ్రామాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో పార్టీలో చేరారు. మద్నూర్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తున్నట్లు త్వరలో నూతన అధ్యక్షురాల ఎన్నిక ఉంటుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కోర్టు స్టే ఎత్తివేయడంతో త్వరలోనే అవిశ్వాస బల పరీక్ష ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ప్రత్యేకాధికారి విజయ్, నాయకులు సంగమేశ్వర్, సాయిలు, సాయిపటేల్, లక్ష్మణ్, గంగాధర్, కుషాల్, గోపి తదితరులున్నారు.

కార్మికుల పొట్టగొడితే ఊరుకోం

నిజాంసాగర్(జుక్కల్) : కార్మికుల రక్తాన్ని పీల్చుకుంటున్న మాగి గాయత్రి కార్మాగారం యాజమాన్యంతో పోరాటం చేసి సమస్యలను పరిష్కారిస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. కార్మికుల పొట్ట గొడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. శనివారం సాయంత్రం మాగి గాయత్రి కార్మాగారం సమీపంలో కార్మికులతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రి కార్మాగారం పని చేస్తున్న కార్మికులకు న్యాయబద్ధమైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు.కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, మల్లికార్జున్, మనోజ్‌పటేల్, శ్రీనుపటేల్, ప్రజా పండరి, కాలిక్ తదితరులు ఉన్నారు. అలాగే తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 161 గ్రామాల్లో నీటి సమస్యకు అవకాశం ఉన్నందున తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ కింద రూ. 1.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు శ్రీకాంత్, అరవింద్ తదితరులున్నారు.

పెళ్లికి వెళ్లివస్తున్న ఆటో బోల్తా

- ఇద్దరు మృతి, 10 మందికి గాయాలు



మూలమలుపులో అదుపుతప్పి బోల్తా పడ్డ ఆటో

లింగంపేట(ఎల్లారెడ్డి): పెళ్లికి హాజరై తిరిగి వెళ్తుండగా ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా, పదిమందికి తీవ్ర గాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బాయంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం సింగీతం, గున్కుల్, వడ్డెపల్లి గ్రామాల నుంచి లింగంపేట మండలం కొర్పోల్ గ్రామంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి పలువురు ఆటోల్లో చేరుకున్నారు. పెళ్లయిన తర్వాత ఓ ఆటోలో 12 మంది తిరుగు ప్రయాణమయ్యారు. బాయంపల్లి శివారులోని మూలమలుపులో ఆటో అదుపుతప్పి రోడ్డు కిందికి పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న సింగీతం గ్రామానికి చెందిన గౌడగారి సంగయ్య(66) అక్కడికక్కడే మృతి చెందాడు. గున్‌కుల్ గ్రామానికి చెందిన లాలవ్వ చికిత్స పొందుతూ ఎల్లారెడ్డి ఆస్పత్రిలో మృతి చెందింది. నిజాంసాగర్ మండలం గున్‌కుల్, వడ్డెపల్లి గ్రామాలకు చెందిన బాలమణి, సతీశ్, సాయవ్వ, పోచవ్వ, కవిత, మరొకరితో పాటు ముగ్గురు చిన్నారులకు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతితో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయా గ్రామాల్లో విషాద చాయలు అలుముకున్నాయి.



గాయాలపాలైన ప్రయాణికులు



అంబులెన్సులో క్షతగాత్రుల తరలింపు

బస్టాండ్‌ను పరిశీలించిన సీపీ

ఖలీల్‌వాడి: నగరంలోని రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లను సీపీ కల్మేశ్వర్ శనివారం పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో సెక్యూరిటీ ఎలా ఉంటుంది అనే విషయాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, ఎస్బీ సీఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీపీ

డీడీ మధుసూదన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్: జిల్లా భూగర్భ, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఏడీ విజయ్ కుమార్ రాథోడ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం వీరిని జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

సుల్తాన్‌షాప్‌లో అగ్ని ప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న సుల్తాన్ బట్టల దుకాణంలో శనివారం విద్యుదాఘాతం సంభవించి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నిజామాబాద్, బోధన్‌కు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దుకాణం నుంచి దట్టమైన పొగలు రావడంతో పోలీసులు చుట్టుపక్కల ఉన్న దుకాణాలను మూసివేయించారు. దీంతో ఆ ప్రాంతంలోని వాహనాల రాకపోకాలకు అంతరాయం ఏర్పడింది.

మద్యం దుకాణాల తనిఖీ



బిచ్కుంద: మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ పోలీసులు శనివారం తనిఖీ చేపట్టారు. నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేసినట్లు సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. రికార్డులు, గోదాములు, దుకాణంలో ఉన్న మద్యం సీసాలను తనిఖీ చేశారు. తనిఖీలో ఎలాంటి నకిలీ మద్యం లభించలేదన్నారు. పిట్లం, బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల మద్యం దుకాణాల యజమానులు ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సీఐ వెంట ఎస్సై నగేశ్, సిబ్బంది ఉన్నారు.